అభివృద్ధి పనులకు ఆటంకం



పుల్పోనిపల్లిలో పాఠశాలను పర్యవేక్షిస్తున్న అదనపు కలెక్టర్(ఫైల్)

- అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో రాజకీయనేతల జోక్యం!

హన్వాడ: ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులు, ఇతర అవసరాలు, సమస్యల పరిష్కారానికి గానూ అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా అభివృద్ధి పనులు చేసేందుకు చర్యలు చేపట్టింది. అందు కోసం ఆయా పాఠశాలలకు నిధులను సైతం మంజూరు చేసింది. కాగా పలు చోట్ల పనులు ప్రారంభమై పూర్తికావస్తుంటే మరికొన్ని చోట్ల రాజకీయ నాయకుల జోక్యం తదితరాల నేపథ్యంలో పనులకు ఆటంకం కలుగుతోంది. వాస్తవానికి పథకం అమలు బాధ్యతలను ఎస్ఎంసీ కమిటీలు, హెచ్‌ఎం, గ్రామ సంఘం వీఓలకు అప్పగించారు. కమిటీ మొత్తానికి వీఓ చైర్మెన్‌గా వ్యవహరిస్తూ.. పాఠశాల



అమ్మ ఆదర్శపాఠశాల కింద ఎంపికైన పెద్దర్పల్లి పాఠశాల

నిధులను సక్రమంగా వినియోగించి అభివృద్ధి చేయాల్సి ఉంది. చైర్మన్‌ల నేతృత్వం లో జరగాల్సిన అభివృద్ధి పనుల్లో స్థానిక నాయకుల జోక్యం తెర పైకి వచ్చింది. దీంతో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోందని.. అధికారులు సైతం ప్రేక్షకపాత్ర వహించాల్సిన దుస్థితి ఏర్పడిందని పలువురు విమర్శిస్తున్నారు. వీఓ నేతృత్వం వహించడాన్ని ఆయా చోట్ల స్థానికంగా అధికారంలో ఉన్న పార్టీల నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని చెబుతున్నారు. వీరిపై అధికార పార్టీ నాయకులే పెత్తనం చెలాయిస్తున్నారని ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు.

మండలంలో మొత్తం 64పాఠశాలలున్నాయి. ఇందులో 42 పాఠశాలల్ని ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలుగా గుర్తించింది. పెద్దర్పల్లి, పుల్పోనిపల్లి, ఇబ్రహీంబాద్, నాగినోనిపల్లి ఇలా వివిధ గ్రామాల్లో మొత్తం 42 పాఠశాలల్ని గుర్తించారు. వీటిల్లో 37పాఠశాలలకు గానూ ఇప్పటివరకు రూ. 1.50కోట్ల నిధులు మంజూరు చేశారు. ఇటీవలే మరో 5 పాఠశాలల్ని ఎంపిక చేసి మరిన్ని నిధులకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం నిధులు మంజూరైన పాఠశాలల్లో అభివృద్ధి పనులు సాగుతున్నాయి. అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. మరికొద్ది రోజుల్లోనే పాఠశాలల పునః ప్రారంభం నేపథ్యంలో వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. పలుచోట్ల రాజకీయ నేతల జోక్యం కారణంగా పనులు మందకొడిగా సాగుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇటీవలే జిల్లా అదనపు కలెక్టర్ సైతం పాఠశాలల్ని సందర్శించి పనుల్ని పర్యవేక్షించారు. పాఠశాలల ప్రారంభం నాటికి పనులు పూర్తి కావాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఇలాంటి ఆటంకాలు ఎదురైతే పనులు ఏ మేరకు పూర్తిచేస్తారోనన్నా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఇబ్బందులున్నా పనులు సాగుతున్నాయి



మండలంలో మొత్తం 37 పాఠశాలల్ని అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపిక చేశాం. మళ్లీ అదనంగా మరో 5 పాఠశాలల్ని చేర్చాం. అదనంగా ఎంపికైన 5పాఠశాలల్లో అభివృద్ధి పనుల నిర్వహణకు నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో అక్కడక్కడ కొంత ఇబ్బంది ఉంది. అయినా సరిదిద్దుకుని వెళ్తున్నాం. పాఠశాలలు పునః ప్రారంభం నాటికి పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– రాజునాయక్, ఎంఈఓ, హన్వాడ

రాజకీయ జోక్యం తగదు



అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో అధికార పార్టీ నేతల పెత్తనం అధికమైంది. ప్రభుత్వం సూచించిన విధంగా ఎంపికైన కమిటీ పర్యవేక్షణలో పనులు జరగాలి. అందుకు విరుద్ధంగా పనుల్లో జోక్యం చేసుకుని పెత్తనం చెలాయించడం సరికాదు. అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడే అవకాశం ఉంది. అధికారులు జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలి.

– బాల్‌రాజు, ఎంపీపీ

పెరుగుతున్న కూరగాయల ధరలు



కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

- బీన్స్ కిలో రూ.150
- రూ.120కు చేరుకున్న పచ్చిమిర్చి, చిక్కుడు

జడ్చర్ల టౌన్: వర్షాకాలం ఆరంభం కానున్న సమయంలో కూర గాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. సాధారణంగా ఏటా ఆషాఢం, శ్రావణ మాసాల్లో ధరలు పెరిగి సామాన్యులను కుదేలు చేస్తుంటాయి. గత ఏడాది సరైన వర్షాలు పడకపోవటం, ఎండలు తీవ్రంగా ఉండటంతో ఈసారి స్థానికంగా కూరగాయల సాగు, దిగుబడి తగ్గింది. ఈకారణంగా ఇతర ప్రాంతాలనుంచి దిగుమతి చేసుకోవాల్సి రావటం వల్ల ధరలు అమాంతం పెరుగుతున్నాయి. పదిరోజుల కిందటి వరకు కిలో పచ్చిమిర్చి ధర రూ.60–80గా ఉండగా ప్రస్తుతం రూ.120కి చేరుకుంది. ప్రస్తుతం మిర్చిసాగు ఈ ప్రాంతంలో తగ్గిపోవటంతో కర్ణాటక బెలాగం నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. దీంతో ధరలు మండిపోతున్నాయి.

రూ.160కి చేరుకున్న బీన్స్

బీన్స్ కిలో రూ.150కి చేరుకోవటం వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తోంది. పేద, మధ్యతరగతి వారు కొనలేని పరిస్థితికి చేరుకొంది. ఈ సీజన్‌లో అత్యధికంగా కొండెక్కిన కూరగాయ ఏదైనా ఉందంటే అది బీన్సే కావడం గమనార్హం. దిగుబడి పూర్తిగా తగ్గిపోవటంతో మార్కెట్‌లో ఒకరిద్దరు మాత్రమే వీటిని విక్రయిస్తున్నారు. బీన్స్‌తో పాటు చిక్కుడు ధర సైతం సామాన్యులకు అందని విధంగా కిలో దాదాపు రూ.120కి చేరుకోవడం గమనార్హం. అయితే అన్‌సీజన్ కావడం వల్లే ధర పెరిగిందని వ్యాపారస్తులు చెబుతున్నారు.

ప్రస్తుతం కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి.

కూరగాయ పేరు	ధర(రూ.కిలో)
బీన్స్	150
పచ్చిమిర్చి	120
చిక్కుడు	120
టమాట	40
బీర	70-80
క్యారెట్	60-70
కాకర	80
క్యాప్సికం	60
క్యాబేజీ	40
వంకాయ	40
ఆలు	40

బీన్స్, చిక్కుడు రావటం లేదు..



బీన్స్, చిక్కుడు మార్కెట్‌కు రావడం లేదు. ఈ కారణంగా బీన్స్ కిలో రూ.150, చిక్కుడు రూ.120కి విక్రయిస్తున్నాం. ఇక పచ్చిమిర్చి, టమాట ధరలు పెరుగుతూనే ఉన్నాయి. పచ్చిమిర్చి బెలాగం నుంచి టమాట రాయలసీమ నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావటం వల్ల ధరలు పెరుగుతున్నాయి.

– నర్సింహులు, కూరగాయల వ్యాపారి

కొనలేని పరిస్థితి..



ఒక్కో సీజన్‌లో ఒక్కో రకం కూరగాయల ధరలు పెరుగుతున్నాయి. కొన్నాళ్లు ఉల్లి, ఎండుమిర్చి ధరలు పెరిగి ఇబ్బందులు పెడితే మరికొన్నాళ్లు పచ్చిమిర్చి, టమాట ధరలు పెరుగుతాయి. ప్రభుత్వాలు ఏడాది పొడవునా ధరలు ఒకేలా ఉండేలా చర్యలు తీసుకుంటే బాగుంటుంది. రైతులు కూడా అన్ని సీజన్‌లకు అనుగుణంగా దిగుబడి వచ్చేలా పంటలు వేస్తే బాగుంటుంది. ఇపుడైతే బీన్స్, చిక్కుడు, పచ్చిమిర్చి, టమాట తదితరాలను కొనలేని పరిస్థితి ఎదురవుతోంది.

– పారిజాత, గృహిణి, బాదేపల్లి

పెరుగుతున్న టమాట ధర..

ఇక ధరలు పెరిగే కూరగాయల్లో టమాట వంతు వచ్చింది. పదిరోజుల కిందటి వరకు కిలో టమాట రూ.30గా ఉండగా నిన్నటి వరకు రూ.50కి చేరుకుంది. రెండు రోజులుగా రూ.40కి తగ్గింది. మున్ముందు మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఎండలు పెరిగిపోవటం, అకాల వర్షాలు పడటంతో దిగుబడి తగ్గి అనంతపూర్ నుంచి దిగుమతి చేసుకుంటుండటంతో ధరలు పెరుగుతున్నాయి.

క్లుప్తంగా

బ్లాక్‌బెల్టు విద్యార్థులకు అభినందనలు



మహబూబ్‌నగర్ క్రీడలు: ఆర్‌కే స్పోర్ట్స్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బ్లాక్‌బెల్టులు సాధించిన విద్యార్థులను శుక్రవారం డీఎస్పీ వెంకటేశ్వర్లు అభినందించారు. విద్యార్థులకు బ్లాక్‌బెల్టులు అందజేశారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ రవికుమార్ మాట్లాడుతూ శివప్రసాద్, అఖిలేష్, దీక్షితులు బ్లాక్‌బెల్టులు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ సలహాదారులు ఎంఎస్.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ నేపథ్యంలో చెక్‌పోస్ట్ ఏర్పాటు



బాలానగర్: బక్రీద్ సమీపిస్తున్న సందర్భంగా మండల కేంద్రంలోని ముఖ్య కూడలి జాతీయ రహదారిపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జున్ గౌడ్, ఎస్ఐ తిరుపాజీ ఆధ్వర్యంలో పలు వాహనాలను రహదారిపై ఆపి తనిఖీలు నిర్వహించారు. ఆవులను తరలించడంపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు వివరించారు. ఎవరైనా గోవధకు పాల్పడితే వారిపై కఠినంగా వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు. ఏదైనా సమాచారం ఉంటే తమకు ఇవ్వాలని సూచించారు.

ఆంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు



మహమ్మదాబాద్: మండల పరిధిలోని గాధిర్యాల్ వీరాంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు చేపట్టారు. హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడంతో గ్రామస్తులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కార్యక్రమం చేపట్టారు. రూ. 2లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో పాల్గొన్న అన్నదాతలకు, గ్రామ యువకులను శాలువాలతో సన్మానం చేశారు. వెంకట్రాంరెడ్డి, ఉపాధ్యాయులు గోపాల్, హనుమయ్య, రాంచందర్, లక్ష్మీకాంత్‌రెడ్డి, శంకరయ్య, అంజిలయ్య, హనుమయ్య, వెంకట్రాములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు పాడిఆవు మృతి

గండీడ్: పిడుగుపాటుకు పాడిఆవు మృతిచెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రంలోని వేపూరి చెన్నయ్య ఆవులను పెంచుకుంటూ వాటి ద్వారా వచ్చిన పాలతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఓ పాడి ఆవుని పొలం దగ్గర కట్టివేశాడు. కాగా సాయంత్రం 4గంటల సమయంలో ఉరుముల మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగు పడటంతో పాడిఆవు అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో సుమారు రూ. 60వేల నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నారాయణపేట రూరల్: మత్తు పదార్థాలకు దూరంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామని ఏఎస్ఐ శ్రీదేవి అన్నారు. శుక్రవారం పట్టణంలోని వైదిక పాఠశాలలో ఎస్ఎస్ఆర్ సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థలు తీసుకోవడంతో కలిగే అనర్థాలను వివరించారు. అదేవిధంగా సైబర్ నేరాల వలలో పడే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. మైనర్లు వాహనాలను నడిపించొద్దని, విపత్తు నివారణ చట్టం అమలులో ఉన్నందున నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాతోపాటు జైలు శిక్ష ఉంటుందన్నారు. నిత్యం యోగా, మెడిటేషన్, వ్యాయామం చేయాలన్నారు. బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, గృహహింసా చట్టాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు అత్యవసర సమయంలో తమ రక్షణకు షీ టీమ్స్ ఉంటాయనే విషయంపై అవగాహన కల్గి ఉండాలని అన్నారు. మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 8712670398కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ బాలరాజు, ఎస్ఎస్ఆర్ డైరెక్టర్ చంద్రశేఖర్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థికి తహసీల్దార్ చేయూత



నవాబుపేట: దొడ్డిపల్లికి చెందిన అనాథ విద్యార్థిని వైష్ణవికి తహసీల్దార్ నాన్యనాయక్ చేయూతనందించారు. నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, పెన్నులు తదితరాలు అందజేశారు. పేద విద్యార్థుల చదువు కోసం తనవంతుగా సహకారం అందించాలని నిర్ణయించుకున్నట్లు తహసీల్దార్ ఈ సందర్భంగా తెలిపారు. కాగా వైష్ణవికి రెండేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ నవాబుపేట కేజీబీవీని సందర్శించిన సమయంలో సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తాజాగా విషయం తహసీల్దార్‌కు వివరించటంతో సహకారం అందించారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్‌నకి చెందిన క్యాసాని నాగరాజుపై దాడి చేసిన ఘటనలో నలుగురిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 4న చెరువు వద్దకు వెళ్లిన నాగరాజుపై పల్లె మల్లేష్, పర్వతాలు, తిరుపతి, రాజు దాడిచేసి గాయపర్చారని తెలిపారు. సమాచారం అందుకున్న బాధితుడి భార్య విజయలక్ష్మి, కుమారుడు కలిసి చెరువు వద్ద వెళ్లారని.. గాయపడిన నాగరాజును హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించి చికిత్స చేయిస్తున్నారని వివరించారు. విజయలక్ష్మి శుక్రవారం ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టరా?



భూత్పూర్ బీసీకాలనీలో మురుగుతో నిండిన గుంత

- నెలల తరబడి శుభ్రతకు నోచుకోని డ్రైయినేజీలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

భూత్పూర్: పట్టణంలోని 9వ వార్డులో మురుగునీటితో గుంతలు, డ్రెయినేజీలు నిండి పారుతున్నాయి. వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నా పరిశుభ్రత చర్యలు చేపట్టడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల 2వ వార్డులోని నర్సింగాపూర్ తండా మురుగునీటి గుంతలు, డ్రెయినేజీలు పారడంతో తండా వాసులందరూ రెండు నెలలుగా జ్వరంతో బాధపడ్డారు. గత ఏడాదిలో బీసీ కాలనీలోనూ చాలామంది దోమకాటుకు గురికాగా వైరల్ జ్వరాలతో పాటు డెంగీ సోకి ఇబ్బందులు పడ్డారు. తాజాగా సైతం బీసీకాలనీలో మురుగు కాల్వలు సరిగా లేకపోవడంతో నీరు



ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పక్కనే చేరిన మురుగు

రోడ్డుపై పారుతోంది. నెలల తరబడి పూడిక తీయకపోవడంతో ఇబ్బందికరంగా మారాయి. కొన్నిచోట్ల డ్రెయినేజీలు ధ్వంసం కాగా తిరిగి నిర్మాణాలు చేపట్టలేదు. ప్రాథమిక వైద్యసిబ్బంది ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాల్సి ఉండగా ప్రస్తుతం దాని ఊసే లేదు. మున్సిపల్, ప్రాథమిక వైద్య సిబ్బంది కార్యాలయాలకే పరిమితమౌతున్నారు.

ఆత్మగౌరవ కవాత్‌కు తరలిరండి

మహబూబ్‌నగర్ రూరల్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జూలై 7న వరంగల్‌లో మాదిగల ఆత్మగౌరవ కవాత్ నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఈఎఫ్, అనుబంధ సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. డ్రెస్ కోడ్ తప్పక పాటించాలని, నల్ల ప్యాంటు, వైట్ షర్ట్, మెడలో కండువా, తలపై టోపీ ధరించి రావాలని కోరారు. నాయకులు బాలరాజు, ప్రభాకర్, కొండయ్య, బోయపల్లి అంజనేయులు, టైగర్ జంగయ్య, కాన్షీరాం, ఖాదరయ్య పాల్గొన్నారు.

బాల్యమంతా బడిలో గడపాలి



జడ్చర్ల పరిధిలో బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ, ఉపాధ్యాయులు



శేరిపల్లి (హెచ్)లో..

జడ్చర్ల టౌన్: బడిబాటలో గ్రామంలోని ప్రతి విద్యార్థిని, వారి తల్లిదండ్రులను కలుసుకుని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా చూడాలని ఎంఈఓ మంజులాదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని కోడ్గల్ జెడ్పీహైస్కూల్ ఉపాధ్యాయ బృందం నిర్వహించిన బడిబాట కార్యక్రమాన్ని ఆమె సందర్శించారు. హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: విద్యార్థులు వారి బాల్యమంతా వృథా కాకుండా బడిలోనే గడపాలని జీహెచ్‌ఎం రాజునాయక్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా రెండో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సిబ్బంది ఉన్నారు.

అడ్డాకుల: బడి బయటి పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని మండల విద్యాధికారి ఎస్.నాగయ్య కోరారు. మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామంలో శుక్రవారం బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూత్పూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్న ట్లు ఎంఈఓ కృష్ణయ్య తెలిపారు. అన్నారు. శుక్రవారం బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

వంతుల వారీగా విధులు!

మిడ్జిల్: మండలంలో బడిబాట కార్యక్రమంపై పర్యవేక్షణ కరువైంది. దీంతో మొదటిరోజు పాఠశాల ఆవరణలో ఫోటోలు దిగి మమ అనిపించారు. ఇక శుక్రవారం రెండోరోజు పాఠశాలలో పనిచేస్తున్న 6 మంది ఉపాధ్యాయులలో సగం మంది మాత్రమే పాల్గొన్నారు. కాగా వంతుల వారీగా కార్యక్రమంలో పాల్గొనాలని ఉపాధ్యాయులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఒకరోజు కొందరు, మరోరోజు మరికొందరు కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రణాళిక వేసుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మండలంలో రెగ్యులర్ ఎంఈఓ లేకపోవడంతో జడ్చర్ల ఎంఈఓకు అదనపు బాధ్యతలు ఇవ్వడంతో పర్యవేక్షణ కరువైందని.. ఇదే అదనుగా కొందరు ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిసింది. విషయంపై ఇన్‌చార్జ్ ఎంఈఓను వివరణ కోరగా.. అందరూ హాజరు కావాలని సూచించినట్లు తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని వివరించారు.



మహమ్మదాబాద్‌లో..



మిడ్జిల్‌లో..



తిమ్మాయిపల్లిలో..

విద్యుత్ సరఫరా లేకపోతే చెప్పండి

జడ్చర్ల టౌన్: వర్షాకాలం ఆరంభం అయినందున గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడితే మా సిబ్బందికి సమాచారం ఇచ్చి పునఃరుద్ధరింపజేసుకోవాలని జడ్చర్ల డీఈ కృష్ణమూర్తి సూచించారు. సమాచారం ఇవ్వకుండా మరమ్మతు చేసుకోవద్దని.. ప్రమాదాల బారిన పడే అవకాశాలు అధికంగా ఉంటాయని హెచ్చరించారు. పైగా చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు.

మృగశిర కార్తెతో చేపలకు డిమాండ్



మండల కేంద్రంలోని సంతలో చేపల కొనుగోలు

బాలానగర్: మృగశిర కార్తె శనివారం ప్రారంభం కానున్న వేళ సంతలో చేపలకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ప్రతి వారాంతపు సంతలో రాత్రి 8 గంటలకు పైగా చేపల వ్యాపారులు చేపల విక్రయాలు జరిపేవారు. కాగా ప్రజలు చేపల కొనుగోలుకు పెద్ద మొత్తంలో రావడంతో శుక్రవారం సాయంత్రం 6 గంటలలోపే 70 శాతం చేపల విక్రయదారులు వాటిని అమ్ముకుని వెళ్లిపోయారు. కాగా తూనికల విషయంలో వ్యాపారులు అవకతవకలకు పాల్పడుతున్నారని పలువురు కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

విద్యార్థులకు సరిపడా బస్సులు నడిపించాలి



నారాయణపేట రూరల్: నూతన విద్యాసంస్థల ప్రారంభం అవుతుండటంతో జిల్లాలో విద్యార్థులకు సరిపడా బస్సులను ఆర్టీసీ ఏర్పాటుచేయాలని పీడీఎస్‌యూ జిల్లా సహకార కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డిపోమేనేజర్ లక్ష్మీసుధాను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. బీద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు పట్టణాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు విద్యను అభ్యసించడానికి వస్తున్నారన్నారు. ప్రజా రవాణా వ్యవస్థ సరిగ్గాలేకపోతే చిన్నపిల్లలు, బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రూట్లలో సరిపడా బస్సులను నడిపించాలని కోరారు. మహాలక్ష్మి పథకం కారణంగా బస్సులు రద్దీగా ఉంటున్నాయని, విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

కార్యకర్తలకు ధన్యవాదాలు

గండీడ్: భారతీయ జనతా పార్టీ గెలుపునకు కృషి చేసిన మండల, జిల్లా, తాలుకా నాయకులకు ధన్యవాదాలు తెల్పుతున్నట్లు మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గత ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా భారీ మెజార్టీ ఇచ్చి చేవెళ్ల ఎంపీ కొండావిశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించినందుకు హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లోనూ పార్టీకి మద్దతుగా నిలవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వీఆర్ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు గోవింద్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల 8న టీఎఫ్‌టీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. పెద్దసంఖ్యలో వీఆర్ఏలు హాజరు కావాలని కోరారు.